క్లుప్తంగా

మహిళలు, విద్యార్థినులకు భరోసా షీటీమ్స్

సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మహిళలు, విద్యార్థినులకు భద్రత కల్పిస్తూ షీటీమ్స్ భరోసాగా నిలుస్తాయని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్గల్ మండలం గౌరారంలోని కావేరి యూనివర్సిటీ విద్యార్థినులకు మహిళల రక్షణకు ఉపయుక్తంగా నిలుస్తున్న వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, మాయ మాటలు వినిమోసపోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. మహిళల భద్రత కోసం ఎల్లవేళలా షీటీమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్ ప్రతాప్‌కుమార్ రెడ్డి, గజ్వేల్ షీటీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు, పీసీలు శ్యామల, రాంచంద్రారెడ్డి, మహేశ్, హరిత, వినోద, సోనీ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ రాజు

హుస్నాబాద్: బాలికల ఆత్మరక్షణ కోసం పాఠశాల స్థాయి నుంచే కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఝాన్సీ లక్ష్మీబాయి పథకం కింద బాలికలకు మూడు నెలల పాటు ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని వీటిని రూపుమాపడానికే బాలికలకు ఉచిత కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ కంటే రాజు, ఉపాధ్యాయురాలు సువర్ణ లీల, పీడీ శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లాకు సన్మానం



రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ సన్మానించారు. బుధవారం వేములవాడలో జరుగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు వెళుతూ సిద్దిపేటలో ఆగారు. ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, సీనియర్ మైనారిటీ నాయకులు కాలీమొద్దీన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వహీద్ ఖాన్, షాబుద్దీన్, కొంగ సాంబమూర్తి, వాహబ్, రషీద్, జనార్దన్ రెడ్డి, వనజ, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి



పంచాయతీ రాజ్ డైరెక్టర్‌ను కలిసి విన్నతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్యదర్శి, ఎల్లాయిగూడ గ్రామ కార్యదర్శి నాగరాజు, కార్యదర్శులు కోరారు. బుధవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంఘం బుధవారం పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. త్వరలో పంచాయతీ రాజ్ యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు శశిధర్‌గౌడ్, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య కోసం వినతి

కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ధర్మ సమాజ్ పార్టీ నాయకులు సురేశ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో వున్న 90 శాతం ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల కోసం కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.

– బెజ్జంకి(సిద్దిపేట):



తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ధర్మ సమాజ్ నేతలు

విజేతలకు.. అభినందనల వెల్లువ

స్థానిక బాలికల హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ మాసంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన సహ పాఠ్యాంశాల్లో గెలుపొందిన విజేతలను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరుల్లో మార్పురావాలని జిల్లా విద్యాధికారి అన్నారు.

కొండపాక(గజ్వేల్):



షీల్డ్, ప్రశంసాపత్రాలు తీసుకున్న విద్యార్థులతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సర్వతోముఖాభివృద్ధికే గ్రంథాలయాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలు అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గ్రంథాలయాలు కనిపించే ఆలయాలు అని అన్నారు. బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్, క్విజ్, సుడోకో, కవిసమ్మేళనం, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాలు ప్రతీఒక్కరు ఉపయోగించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. సమాజ శ్రేయస్సుకు గ్రంథాలయం పాటుపడుతోందన్నారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు వృద్ధిలోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సుధీర్, అడ్వకేట్ చిత్తారి రవీందర్, కవులు చొప్పదండి సుధాకర్, ఉండ్రాళ్ల రాజేశం గ్రంథపాలకులు దాసరి రాజు, కే రాజు, కనకలక్ష్మి, ముజఫర్, ఉమాపతి, సాయి ఉపాధ్యాయులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో లింగమూర్తి

అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్ జిల్లా బీఎస్‌ఎన్‌ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గా సిద్దిపేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు అంబడిపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. సిద్దిపేటలో బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్ చేతుల మీదుగా తన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందనడానికి తనకు పదవి రావడమే నిదర్శనన్నారు. పార్టీలో అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



బీఎస్‌ఎన్‌ఎల్ కమిటీ మెంబర్ నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

మహాసభలకు కార్మికులందరు తరలిరండి

దౌల్తాబాద్: జనవరి 4 ,5వ తేదీలలో జరిగే టీజీ యూయూఈయూ సీఐటీయూ మహాసభల్లో కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీజీ యూయూఈయూ సీఐటీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటుపల్లి సధాకర్ అన్నారు. బుధవారం రోజు దౌల్తాబాద్, రాయపోల్ మండలాల సెక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.పద్మనాభం, ఉపాధ్యక్షులుగా సత్తిరెడ్డి, రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ నజీర్, కోశాధికారి జె.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేశ్, ఎండీ అంజాద్, సహాయ కార్యదర్శులుగా సత్తయ్య, రాజు, కరుణాకర్‌లు ఎన్నికయ్యారు.




దౌల్తాబాద్: నూతనంగా ఎన్నికైన టీజీ యూయూఈయూ యూనియన్ సభ్యులు

తరలిరండి

వర్గల్(గజ్వేల్): కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనవరి 4, 5వ తేదీలలో సిద్దిపేటలో జరగనున్న తెలంగాణ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దామని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటిపల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం వర్గల్ మండలం గౌరారం ఫంక్షన్ హాల్‌లో యూనియన్ అధ్యక్షుడు సతీశ్ అధ్యక్షతన గౌరారం, మర్కూక్ సెక్షన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చ జరుగుతోందన్నారు. పెద్దసంఖ్యలో కార్మికులు మహాసభలకు తరలివెళ్లాలన్నారు. రవికుమార్‌గౌడ్, డప్పు పరశురాములు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ప్రవీణ్‌బాబు బుధవారం సందర్శించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధనా తీరును, మధ్యాహ్న భోజన నిర్వహణ, కనీస మౌలిక వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి. రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రాజేశ్వర్, జాషువా పాల్గొన్నారు.



అందె ప్రాథమిక పాఠశాలలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంఈఓ ప్రవీణ్‌బాబు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మత్స్యశాఖకు రూ. 3 వేల కోట్లు కేటాయించి మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ దశాబ్ది, మత్స్యకారుల దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన త్వరగా పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: తుంచేయడానికి కేసీఆర్ మొక్క కాదని, మహావృక్షమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. అవిశ్రాంత పోరాటంతో తెలంగాణ స్వరాష్ట్రం కలను నిజం చేయడమే కాకుండా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తన పరిపాలన దక్షతతో తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేశారని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతీఇంటికి అందాయని చెప్పారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడితో తెలంగాణకు ఉన్న అనుబంధాన్ని ఎవరూ చెరిపేయలేరని అభిప్రాయపడ్డారు. సీఎం ఇష్టారాజ్యంగా తమ అధినేతపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తే గౌరవం ఇవ్వకుండా మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి నేడు విజయోత్సవ సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నంగునూరు(సిద్దిపేట): షెడ్డులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్సై ఆసిఫ్ తెలిపారు. నంగునూరు మండలం కొనాయపల్లికి చెందిన దువ్వల రాజయ్య పౌల్ట్రీ ఫామ్‌లో ఉంచిన 38.20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ స్వాధీనం చేసుకున్నామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన మాలోతు వెంకటేశ్‌విగా గుర్తించామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నంగునూరు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పంచనామా నిర్వహించారు.

కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి

గజ్వేల్‌రూరల్: ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి పాడి గేదె మృతిచెందిన సంఘటన చిన్నఆరెపల్లిలో బుధవారం జరిగింది. బాధితుడు మిరుదొడ్డి వేణు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన వ్యవసాయ పొలంలో పాడి గేదె మేత మేస్తున్న క్రమంలో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అక్కడిక్కడే మృత్యువాత పడిందని కన్నీటి పర్యంతం అయ్యాడు. రూ.1.20 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

అక్కన్నపేట(హుస్నాబాద్): లగచర్ల ఘటన బాధితులకు మద్దతు తెలిపేందుకు వెళ్లనున్న స్థానిక గిరిజన నాయకులను ముందస్తు అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాన్ని ఆపలేరని ఆ సంఘాల నాయకులు నూనావత్ మోహన్‌నాయక్, భూక్య కృష్ణనాయక్‌లు అన్నారు. బుధవారం గిరిజన నాయకులను ముందస్తుగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవనాధరమైన భూములను లాక్కుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఫార్మా కంపెనీ పేరుతో గిరిజన జోలికి వస్తే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఏకతాటిపైకి వచ్చి ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. భానోతు సంతోశ్ నాయక్, రైనా నాయక్, శ్రీకాంత్, రాజునాయక్‌లను అరెస్టు చేశారు.



అరెస్టు అయిన గిరిజన నాయకులు

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): మత్తు పదార్థాల జోలికి పోవద్దని మిరుదొడ్డి ఎక్సైజ్ సీఐ గాయత్రి అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ మూర్తి ఆదేశాల మేరకు మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు బుధవారం గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వల్ల జీవితం నాశనమైపోతుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సరిత, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు, మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు కృష్ణ, షాబొద్దీన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చెకుముకి సైన్స్ సంబురాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చెకుముకి సైన్స్ పోటీలు గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సిద్దిపేట పట్టణ జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు మహేందర్, సభ్యులు అజీజ్, నరసింగరావు, సుధాకర్‌లు బుధవారం పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, మండలాలలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ, కేజీబీవీ, అన్ని యజమాన్యాల రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలలు, పాఠశాలల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను మండల స్థాయిలో నిర్వహించే సైన్స్ పోటీలకు పంపుతామని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. సృజనాత్మకతను వెలికి తీయడం, సైన్స్ పట్ల ఆసక్తి పెంచడం, పోటీతత్వం పెంచడం కోసం ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలు, మూఢనమ్మకాలను పారదోలేందుకు విద్యార్థులను సిద్ధం చేయడం ఈ పోటీల ఉద్దేశమని తెలిపారు.



పూజలు చేస్తున్న ఆలయ సిబ్బంది, పండితులు

వార్షికోత్సవం ప్రారంభం

కొండపోచమ్మ ఆలయ 23వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పూలతో అలంకరించారు. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యహవచనం , అఖండ దీపస్థాపన, అగ్ని ప్రతిష్ట, అభిషేకం, హోమం కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని ఈఓ రవి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్):



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంక్షిప్త వార్తలు

◆ **డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఆహ్వానం**

సిద్దిపేటజోన్: కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతీ యువకులు డేటా ఎంట్రీ చేయడానికి కావాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఒక్కో దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు గాను రూ.20లు ఇస్తామన్నారు. వివరాలకు టౌన్ ప్లానింగ్ విభాగంలో శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

◆ **పేదల సమస్యలు పరిష్కరించాల్సిందే**

హుస్నాబాద్: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రవీందర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణలో 90 శాతం పైగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల ప్రజలు ఉన్నారని తెలిపారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఈ ఐదు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌పీ మండల అధ్యక్షుడు చెంచల యెల్లన్న, నాయకులు భిక్షు, వెంకటేశ్, రమేశ్, సతీశ్, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

◆ **గ్రామాల్లో వైద్యపరీక్షలు**

అక్కన్నపేట(హుస్నాబాద్): కార్మిక శాఖ ఆధ్వర్యంలో లెబర్‌కార్డులు కలిగివున్న వారందరికీ ఉచితంగా వైద్యపరీక్షలను నిర్వహించారు. బుధవారం అక్కన్నపేట మండలం రామవరం, దాస్‌తండా గ్రామాల్లో స్టాఫ్‌నర్సు అలీయాబేగం, ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ జీషాలు 25 మంది రోగులకు పరీక్షలు చేశారు. రిపోర్టులను 10 రోజుల వ్యవధిలో సెల్‌ఫోన్‌లకు పంపుతామన్నారు. లెబర్‌కార్డు కలిగి ఉన్న వారికి ఏడాదిలో ఒక సారి ఉచితంగా వైద్యపరీక్షలను చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని లెబర్‌కార్డులు కలిగి ఉన్న వారందరూ ఉపయోగించుకోవాలన్నారు.

◆ **ఎమ్మెల్సీకి ధన్యవాదాలు**



కొమురవెల్లి(సిద్దిపేట): ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌కు గ్రామానికి చెందిన ముదిరాజు నాయకులు బుధవారం ధన్యవాదాలు తెలిపారు. అయినాపూర్ గ్రామానికి చెందిన కుక్కల రాజుకు రూ. 2లక్షల విలువైన ఎల్.వో.సీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలు ఇస్తారి, పాడిశెట్టి, పిట్టా శ్రీనివాస్, కృష్ణ , చంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి గ్రామసభలు**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులు కొనసాగాల్సి ఉంది. ఈ కాలువల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం నేటి నుంచి గ్రామసభలను నిర్వహిస్తునట్లు తహసీల్దార్ అనంతరెడ్డి బుధవారం పేర్కొన్నారు. గురువారం అంతక్కపేట గ్రామపంచాయతీలో గ్రామసభ ఉంటుందన్నారు. ఈనెల 22న కేశవాపూర్, 23న కట్కూర్, 25న మల్లంపల్లి, 26న జనగామ, 28న రేగొండ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

◆ **బ్యాంకుల సందర్శన**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని పలు బ్యాంకులను గజ్వేల్ సీఐ బీ సైదా బుధవారం సందర్శించారు. ఆయా బ్యాంకు మేనేజర్లతో ఆయన మాట్లాడారు. గత వారం రోజుల క్రితం ఎస్‌బీఐ బ్యాంకులో జరిగిన దోపిడీ గురించి వివరిస్తూ బ్యాంకులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాల గురించి లాకర్స్ సేఫ్టీ, లావాదేవీల్లో తదితర అంశాలపై చర్చించారు.

◆ **వరి కొయ్యలను కాల్చవద్దు**

చిన్నకోడూరు(సిద్దిపేట): వరి కొయ్యలను కాల్చవద్దని.. కాలిస్తే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామంచ, గంగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. వరి కొయ్యలను కాల్చడంపై జరిగే నష్టాలను రైతులకు వివరించారు. వాటిని కాల్చడం వల్ల వేడితో భూమి సారాన్ని కోల్పోతుందని, కాలిస్తే సూక్ష్మజీవులు నశించిపోతాయన్నారు. కాల్చకుండా దుక్కి దున్నాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.